క్లుప్తంగా

దిగువశెంబికి బీటీ రోడ్డు పూర్తి

● ఆనందంలో గిరిజనులు



నిర్మాణం పూర్తి చేసుకున్న బీటీ రోడ్డు

సాలూరు రూరల్: మండలంలోని దిగువశెంబి నుంచి డిప్పల పాడు మీదుగా తోణాం వెళ్లే రహదారి పనులను పంచాయతీ రాజ్‌శాఖ పూర్తి చేసింది. రూ.779 లక్షల అంచనా విలువతో ఈ ఏడాది జనవరిలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఈ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇటీవల ఈ రోడ్డు పనులు దాదాపు పూర్తయ్యాయి. దశాబ్దాలుగా గిరిశిఖర గ్రామాలకు రోడ్డు లేక ఇబ్బందులు పడిన గిరిజనులు ఏకంగా బీటీ రోడ్డు నిర్మాణం కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

పాలకొండ రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ పేరున సమస్యలపై వినతులు స్వీకరిస్తామని ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు తెలియజేసిన సమస్యలను పీజీఆర్ఎస్‌లో నమోదు చేసి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు.

ప్రిజమ్ - 10 అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్

భామిని: కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రిజమ్ -10 కచ్చితంగా అమలు చేయాల్సిందేనని ఎంపీడీఓ పి.కిశోర్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత గల గర్భిణులకు ఎటువంటి చికిత్స అందించాలి.. సుఖ ప్రసవాలు జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎ.శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సందీప్, వైద్యాధికారులు పి.సోయల్, కె.రవీంద్ర, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

బొబ్బిలి రూరల్: మండలంలోని గొర్లెసీతారాంపురం వద్ద ఉన్న కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గాడి ప్రసాద్, శారద ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా చేపట్టి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

29న మండల సమావేశం

బొబ్బిలిరూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 29న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రవికుమార్ సోమవారం తెలిపారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా ముత్యాలమ్మతల్లి పండుగ

వంగర: మండలంలోని లక్ష్మీపేట గ్రామంలో గ్రామదేవత ముత్యాలమ్మతల్లి పండుగ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామస్తులంతా గ్రామదేవత ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి అభిషేకాలు చేశారు. పసుపు కుంకుమతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు, స్నేహితులు, బంధువలతో గ్రామంలో సందడి నెలకొంది.

కందకాల ఏర్పాటుపై రైతుల ఆసక్తి

రేగిడి: ఉపాధిహామీ పథకంలో భాగంగా అమలు చేస్తున్న కందకాల ఏర్పాటు పథకం రైతులకు ఎంతో ఉపయోగపడుతోంది. ఉంగరాడ, గుళ్లపాడు, సంకిలి గ్రామాల్లో రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. తాము సాగుచేస్తున్న జీడి, మామిడి తోటల్లో ఫారం పాండ్ల తవ్వకానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ విధానం ద్వారా వర్షపునీరు తోటలకు మళ్లించవచ్చని రైతులు అంటున్నారు.

విధుల్లోకి తీసుకోవాలి



విధుల్లోకి తీసుకోవాలని కోరుతున్న ఆదివాసీ వైద్యసిబ్బంది

పార్వతీపురం:

గిరిజన ఆశ్రమ పాఠశాల, ఏకలవ్య పాఠశాలల్లో గతంలో పనిచేసిన గిరిజన ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గిరిజన సంక్షేమసంఘం నాయకుడు పాలక రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తూ, చాలీచాలని జీతాలతో, సమయానికి జీతాలు రాకపోయినా విద్యార్థులకు వైద్యసేవలు అందించారన్నారు. గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి ఏఎన్‌ఎంల నియామకంపై మొదటి సంతకం చేయడం అభినందనీయమన్నారు. గతంలో పనిచేసిన ఆరోగ్య సిబ్బందిని ఏఎన్‌ఎంలుగా మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

● డీఎస్‌ఓ శివప్రసాద్



చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ప్రత్యేకాధికారి శివప్రసాద్

పాచిపెంట: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి డీఎస్ఓ శివప్రసాద్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని పణుకువలస అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. భోజనం చేసే ముందు, చేసిన తరువాత, కాలకృత్యాలు తీర్చుకున్న తరువాత రోజుకు కనీసం 6 నుంచి 10 సార్లు సబ్బుతో చేతులు కడుక్కోవాలని సూచించారు. కాచి వడపోసిన నీటిని తాగాలని తదితర ఆరోగ్య సూత్రాలను వివరించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రవేశం కార్యక్రమం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంఈఓ సింహాచలం

పార్వతీపురంటౌన్: నూతన విద్యా సంవత్సరంలో మండలంలోని పాఠశాలల్లో విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యా శాఖాధికారి 1 సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం మండలం, మున్సిపాలిటీ పరిధిలోని అన్ని యాజమాన్య ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈఓ 1 సామల సింహాచలం మాట్లాడుతూ విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో నెల రోజుల పాటు విద్యా ప్రవేశం కార్యక్రమం నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. స్టూడెంట్‌కిట్స్‌ను ప్రతి విద్యార్థికి పంపిణీ చేయాలని, ఉపాధ్యాయులందరూ సమయ పాలన పాటించాలని, ఫేషియల్ అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలని స్పష్టం చేశారు.

విద్యాశాఖలో అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాల పేర్లను మార్పు చేశారని, వాటన్నిటినీ గమనించి నూతన పేర్లను వినియోగించాలని ఆదేశించారు. రిజిస్టర్స్, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, పాఠశాల పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చి దిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 కె.ప్రసాద రావు, మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్త్ వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి..



ఐటీడీఏ ఏపీఓకు వినతిపత్రం ఇస్తున్న హెల్త్ వలంటీర్లు

సీతంపేట: ఆదివాసీ ఆరోగ్యం పేరిట గతంలో ఆశ్రమ పాఠశాలలు, పోస్టుమెట్రిక్, జెడ్పీహెచ్ పాఠశాలల్లో పనిచేసిన హెల్త్ వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని పలువురు కోరారు. ఈ మేరకు ఐటీడీఏ ఏపీఓను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ, థర్డ్ పార్టీ నిబంధనల ప్రకారం 2019 నుంచి తమను తొలగించారన్నారు. మళ్లీ తమకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వసతిగృహాలు, స్కూళ్ల ఆరోగ్య కార్యకర్తల రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహనరావు, సంతోష్, లక్ష్మీకాంతం, అరుణ, తదితరులున్నారు.

డోకులగూడలో తాగునీటి ఇక్కట్లు



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న గిరిజన మహిళలు

భామిని: మండలంలోని డోకులగూడ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసినా నీరు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రజల ఇబ్బందులు గమనించిన నల్లరాయిగూడ సర్పంచ్ బిడ్డిక గయామీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బిడ్డిక ప్రసాద్ ట్రాక్టర్లపై ట్యాంక్‌లు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీతంపేటలో 'నేను బడికిపోతా' ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది

సీతంపేట: మండల కేంద్రంలో 'నేను బడికిపోతా' కార్యక్రమంలో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర, డిప్యూటీ ఈఓ పి.నారాయుడు ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల నుంచి దోనుబాయి జంక్షన్ వరకు విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ఆరు నుంచి 16 సంవత్సరాల పిల్లలు ప్రతిఒక్కరూ పాఠశాలలోనే ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవులు, ఎంఈఓ సూర్యచంద్రరావు, హెచ్ఎం పద్మశ్రీ పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో శానిటేషన్ డ్రైవ్



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ, ఏఈ ప్రవళిక

పాలకొండ రూరల్: మండలంలోని ప్రతి గ్రామంలో విధిగా శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి, పనులు చేపట్టాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవళిక, కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టండి

● ఎంపీడీఓ కిశోర్‌కుమార్

భామిని: వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాల్లో త్వరితగతిన పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ పి. కిశోర్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. తక్షణమే గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు.

29న గురుకుల ప్రవేశ పరీక్ష

రేగిడి: ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 6 నుంచి 9 తరగతి వరకూ మిగులు సీట్ల భర్తీకి ఈనెల 29న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి.సూర్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటలు వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

ప్రజల నుంచి 'స్పందన' కరువు

బొబ్బిలి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నిర్వహించిన ప్రజాస్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. అధికారుల వైఫల్యమో లేక తమ సమస్యలపై ప్రభుత్వం నుంచి ఇప్పుడే స్పందన రాదేమోనన్న అనుమానమో కానీ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపలేదు. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా స్పందనకు అర్జీదారులు కానరాలేదు. దీనిపై ఆయా శాఖల అధికారుల వివరణ కోరగా ప్రజల నుంచి తమకు ఎటువంటి ఫిర్యాదులు రాలేదని తెలిపారు.

గడువు పొడిగింపు

రాజాం: దక్షిణ భారత హిందీ ప్రచార సభ-మద్రాస్ నిర్వహించే హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు జూలై 15 వరకు గడువు పెంచినట్లు రాజాంకు చెందిన హిందీ ప్రచారక్ కె.మధుసూధనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ స్థాయి వరకూ ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో పరీక్షలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 99499 17365ను సంప్రదించాలని కోరారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటాం..

భామిని: ఎన్నికల్లో ఓటమి చెందినందుకు కార్యకర్తలు డీలా పడవద్దని, ప్రతి ఓటమీ విజయానికి తొలి మెట్టుగా భావించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు అన్నారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అగతముడి రఘు, గెల్లంకి రమేష్, సర్పంచ్‌లు తొగరాన శ్రీను, నిమ్మల కేశవ, తమ్మారావు, లజ్జాయి, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం



ముగడలో ప్రచారం చేస్తున్న ప్రభోద సేవా సమితి సభ్యులు

బాడంగి: జ్యేష్ట పౌర్ణమిని పురస్కరించుకొని ఇందూ జ్ఞానవేదిక బొడ్డాం కమిటీ సభ్యులు, త్రైతసిద్ధాంతం-ప్రభోద సేవాసమితి ప్రతినిధులు మండలంలోని భీమవరం, ముగడ గ్రామాలలో త్రైతసిద్ధాత భవద్గీతపై సోమవారం ప్రచారం చేపట్టారు. గురు, శిష్యుల సంబంధాన్ని, త్రైత సిద్ధాంతంలోని అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రభోద సేవా సమితి చైర్మన్ రామినాయుడు, సభ్యులు కె.గణేష్, రామ్‌నాయుడు, సూరపు నాయుడు, గుండ కృష్ణ, శ్యామ్, రమేష్, లక్ష్మి, రమణమ్మ, కొండమ్మ, తదితరులుపాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచండి

● సీపీఎం నాయకుల వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

బలిజిపేట: వర్షాకాలం ప్రారంభమైంది. గ్రామాలు పారిశుద్ధ్య లోపంతో దుర్గంధభరితంగా ఉన్నాయని పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీఓ రమేష్‌నాయుడికి సోమవారం వినతిపత్రం అందించారు. వీధికాలువల్లో పూడికలు తీయకపోవడంతో దుర్గంధభరితంగా ఉన్నాయని, వీధుల్లోకి మురుగునీరు ప్రవహిస్తోందని, కనీసం పరిశుభ్రత లేదన్నారు. పూడికలు తీయించాలని, దోమలమందును స్ప్రే చేయించాలని, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలని డిమాండ్ చేశారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విషజ్వరాలు రాకముందే అధికారులు అప్రమత్తమై పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని కోరారు. కార్యక్రమంలో మన్మథరావు, బి.భానుమూర్తి, పి.వెంకటస్వామి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అతిసార నివారణకు ముందు జాగ్రత్త చర్యలు

● ఎంపీడీఓ ఎం. ఈశ్వరరావు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు

సీతానగరం: వర్షాకాలంలో ప్రజలకు వచ్చే డయేరియా(అతిసార) వ్యాధి నివారణకు గ్రామాల్లో ముందు జాగ్రత్తచర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులకు ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్ కుమార్, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మతో కలిసి పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికే పారిశుద్ధ్య పనులు ప్రారంభించామని, పూర్తిస్థాయిలో పనులు చేయాలని తీయించిన చెత్తకుప్పలను దూర ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వైద్య సిబ్బంది సహకారంతో మంచినీటి బావులు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ చేయించాలని, దోమల నివారణకు దోమలమందు పిచికారీ చేపట్టి, ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. ఇంటింటి కుళాయిల పథకం ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సమకూర్చడానికి సత్వర చర్యలు తీసుకోవాలని చెప్పారు. జ్వరాల నియంత్రణకు ముందు జాగ్రత్త చర్యగా వైద్యారోగ్య శాఖ అధికారులతో అన్నిగ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడానికి పంచాయతీరాజ్, వైద్యారోగ్యశాఖ, ఇంజినీరింగ్ శాఖలు సమన్వయంతో అవసరమైన ప్రణాళికలు రూపొందించుకుని పనులు చేపట్టాలని, ప్రగతిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాలని స్పష్టం చేశారు.

విద్యుత్ లైన్ల పునరుద్ధరణ



లక్ష్మీపురం-బుడ్డిపేట గ్రామాల విద్యుత్ లైన్లను సరిచేస్తున్న సిబ్బంది

సీతానగరం: ఈదురుగాలులకు మండలంలో వాలిపోయిన స్తంభాలు, విద్యుత్ వైర్ల పునరుద్ధరణ పనులు విద్యుత్ శాఖ అధికార సిబ్బంది సహకారంతో జరుగుతున్నాయని ఏఈఈపీడీసీఎల్ ఏఈ జగన్మోహనరావు తెలియజేశారు. ఈ మేరకు అప్పయ్యపేట సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న విద్యుత్‌లైన్ల పునరుద్ధరణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ బూర్జ, అప్పయ్యపేట సబ్‌స్టేషన్‌లకు అనుసంధానంగా ఉన్న విద్యుత్ లైన్ల పనులతో పాటు వాలిపోయిన స్తంభాల పునరుద్ధరణ జరుగుతోందని తెలిపారు. అలాగే పామాయిల్ తోటల్లో ఉన్న లైన్లకు రక్షణగా కొమ్మలు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించనున్నట్లు చెప్పారు.

గొంతువాపు నివారణకు టీకాలు వేయించాలి



గేదెలకు గొంతువాపు వ్యాధినిరోధక టీకాలు వేయిస్తున్న డాక్టర్ దీనకుమార్

సీతానగరం: పశువుల్లో ఆశిస్తున్న గొంతువాపు వ్యాధి నివారణ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండడమే కాకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని పశుసంవర్థక శాఖ సబ్‌డివిజన్ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం సబ్‌డివిజన్ పరిధిలో పశువులకు గొంతువాపు వ్యాధి నివారణకు వేస్తున్న టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొంతు వాపు వ్యాధి తొలకరిలో అన్ని పశువుల్లో వస్తున్నప్పటికీ ఎక్కువగా నల్లజాతి (గేదెలు) పశువుల్లో వస్తుందని, ఈ నేపథ్యంలో ఆయా మండలాల పశువైద్యాధికారుల పర్యవేక్షణలో గొతువాపు వ్యాధి నివారణకు అవసరమైన టీకాలు గ్రామాల్లో ఆర్బీకే పశువైద్య సహాయకులు,పశువైద్య సిబ్బంది పశువులున్న శాలల్లో వ్యాక్సిన్స్ వేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న పశువైద్యులకు రైతులు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ వరహాలు

పాలకొండ : ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో భాగంగా అర్జీదారులు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వరహాలు అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తిగత, సామాజిక సమస్యలపై అర్జీలు అందజేశారు. ప్రధానంగా తోటపల్లి ఎడమ కాలువ ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఇళ్ల స్థలాలకు పొజిషన్ పత్రాలు అందించాలని పలువురు మహిళలు కోరారు.

ప్రయాణికుల జీవితాలతో చెలగాటం వద్దు

● ఏఆర్‌టీఓ కుమార్



బత్తిలి సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఏఆర్‌టీఓ కుమార్, డీఎం వెంకటేశ్వరరావు

భామిని : ప్రయాణికుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని ఏఆర్‌టీఓ జీఎస్ఎస్ఆర్‌కే కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ టి. వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని బత్తిలిలో సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు. వాహనాలకు ఫిట్‌నెస్‌పరీక్షలు చేయించాలన్నారు. నిబంధనలు పాటించని కొంతమందికి అపరాధ రుసుం విధించారు.

యువత మత్తుకు బానిస కావద్దు



వంగర: మాట్లాడుతున్న ఎస్సై వై.వి.జనార్దన్

వంగర: యువత మత్తుకు బానిస కావద్దని ఎస్సై వై.వి.జనార్దన్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య అక్రమ సరఫరా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, కొకైన్ వంటివి తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాలకు బానిసైతే ఆరోగ్యం పాడవ్వడంతో పాటు జీవితాలు నాశనమవుతాయన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొరటాన నారాయణరావు, అధ్యాపకులు తూలుగు ఈశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

రేగిడిలో..

రేగిడి: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావొద్దని ఎస్సై ఇ.శ్రీనివాసరావు సూచించారు. ఉంగరాడమెట్ట వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సోమవారం మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల వెచ్చించి విద్యార్థులను చదివిస్తుందని, ప్రతీ ఒక్కరు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.